క్లుప్తంగా

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. స్థానిక సమస్యలను నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నెంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చునన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆసక్తిగా భగవద్గీత పోటీలు



భగవద్గీత పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

సామర్లకోట: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వివేకానంద గ్రంథాలయంలో నిర్వహించిన భగవద్గీత పోటీలు ఆసక్తిగా జరిగాయి. మండల స్థాయిలో విద్యార్థులకు నిర్వహించిన పోటీలను వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పి.రవిశంకర్ పట్నాయక్ ప్రారంభించారు. 66 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థాయిలో బహుమతులు సాధించిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు పట్నాయక్ తెలిపారు. ఎల్‌కెజీ నుంచి 3వ తరగతి విభాగంలో తణుకు హారిక ప్రథమ, కంచర్ల మోక్ష ద్వితీయ, కంచర్ల జ్యోతి తృతీయ బహుమతులు గెలుచుకున్నారు. 4వ తరగతి నుంచి 7వ తరగతి విభాగంలో టి.అఖిల ప్రథమ, ఎ.సాయిఅరాధన ద్వితీయ, పి సూర్యత్రిపుర తృతీయ బహుమతులు సాధించారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి విభాగంలో బి.రాధకృష్ణసాయి ప్రథమ, ఎస్.కరేనా ద్వితీయ, జె.భలేష్‌బాబు తృతీయ స్థానాలు సాధించారు. ఈ కార్యక్రమం లో విశ్వహిందూ పరిషత్ నాయకులు కర్రి ఆదినారాయణరెడ్డి, చంటిబాబు, కంచర్ల రామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, ఎం.శ్రీనివాసరావులు పాల్గొన్ని విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వైభవంగా హరిహర మహాయజ్ఞం

యానాం: పవిత్ర కార్తీక మాసంను పురస్కరించుకుని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఆధ్వర్యంలో స్థానిక గౌతమీ గోదావరి తీరంలో ఆదివారం నిర్వహించిన హరిహర మహాయజ్ఞం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సుమారు 10 ఎకరాల స్థలంలో వేసిన పందిరిలో జరిగిన మహాయజ్ఞానికి యానాం పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో గోదావరి తీరం జనసంద్రమైంది. ప్రాంగణమంతా భక్తుల శివనామస్మరణతో మార్మోగింది. ఉదయం 6 గంటల నుంచి నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే అశోక్, లక్ష్మీస్నేహ దంపతులు పాల్గొన్నారు. గణపతిపూజ, పుణ్యాహవచనం, ఋత్విక్‌వరుణ, దీక్షాధారణ, సూర్యనమస్కారాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష్మీనారాయణ పూజ, మహామృత్యుంజయ హోమం, పూర్ణాహుతిని నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్పస్వామి మాలధారులు సైతం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన అన్నసమారాధనకు వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, సీఐ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా యానాం, పరిసర ప్రాంతాల ప్రజలు సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో ఈ మహాయజ్ఞాన్ని చేపట్టామన్నారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్సీ కర్రి పద్మావతి, కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మెన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి కుమార్ పాల్గొన్నారు.

మహిళలకు మరింత దన్ను

- ఉత్పత్తుల ప్రోత్సాహానికి మెప్మా మార్కెట్లు
- ముఖ్య కూడళ్లలో ఆహా క్యాంటీన్ల ఏర్పాటు



స్వయం సహాయక సంఘాలు తయారు చేసిన వస్తువులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: మహిళలు స్వయం సమృద్ధి సాధించేందుకు స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసిన ప్రభుత్వం వీరిని మరింత ప్రోత్సహించే దిశగా దృష్టి సారించింది. కుటుంబ పోషణలో తమదైన పాత్ర పోషిస్తున్నా మరింత దన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ క్రమంలోనే డ్వాక్రా ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించి, ప్రోత్సహించే లక్ష్యంతో మెప్మా అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేసింది. మరో వైపు ఎంపిక చేసిన కొన్ని సంఘాలతో రుచికరమైన అల్పాహారాలను 'ఆహా' క్యాంటిన్లను సైతం ప్రోత్సహిస్తోంది. ఈ విధానం స్వయం సహాయక సంఘాలను నిర్వహిస్తోన్న మహిళలకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తోంది.

మెప్మా అర్బన్ మార్కెట్ల ఏర్పాటు

కాకినాడలో దాదాపు 7 వేల మహిళా సంఘాల్లో 70 వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం బ్యాంకుల ద్వారా కల్పించే డ్వాక్రా రుణ సదుపాయంతో అధిక శాతం టైలరింగ్, కిరణా, పాన్‌షాపులతో పాటు అనేక ఇతర వ్యాపారాలను సాగిస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. సుమారు 30 శాతం మంది ఇళ్ల వద్దే పచ్చళ్ల తయారీ, తినుబండారాల విక్రయాలు, చిన్నచిన్న గృహోపకరణాల తయారీ, అల్లికలు వంటి వస్తువులు తయారు చేసుకుని విక్రయిస్తూ కుటుంబ పోషణలో భాగస్వాములవుతున్నారు. అదే సమయంలో వీరి ఉత్పత్తులకు తగిన మార్కెటింగ్ సదుపాయాన్ని, మంచి ధరను కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం



ఆహా క్యాంటీన్ నిర్వహిస్తున్న మహిళలు



మహిళలు తయారుచేసిన తినుబండారాలు

నెలకొకసారి మెప్మా అర్బన్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని సంకల్పించింది. రద్దీగా ఉండే ముఖ్య కూడళ్లలో వీటిని ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేయడం ద్వారా ప్రజల ద్వారా మంచి మార్కెటింగ్ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ ప్రియంవద పర్యవేక్షణలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నామని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ డేగల వెంకటరాజు చెప్పారు. ఇటీవలే ప్రారంభించిన ఈ మెప్మా అర్బన్ మార్కెట్లకు ప్రజల నుంచి మంచి స్పందనే కనిపిస్తోంది.

'ఆహా' క్యాంటీన్లతో సహకారం

స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణలో నాణ్యమైన అల్పాహారాన్ని (టిఫిన్ సెంటర్) తక్కువ ధరకు అందించే లక్ష్యంతో ఆహా క్యాంటిన్లను కూడా ప్రోత్సహిస్తున్నారు. సిటీ పరిధిలో ఉన్న టౌన్ లెవెల్ ఫెడరేషన్ల ద్వారా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ప్రాథమికంగా నగరంలోని డైరీఫారం సెంటర్, త్రిపురసుందరి ఆలయం, ఈట్ స్ట్రీట్, నాగమల్లితోట సెంటర్లలో వీటిని ఏర్పాటు చేశారు. వీటికి అవసరమైన బ్యానర్, ఇతర సామగ్రిని ప్రభుత్వమే సమకూరుస్తోంది. ఇలా అర్బన్ మార్కెట్లు, క్యాంటిన్ల ద్వారా మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు.





మెప్మా అర్బన్ మార్కెట్‌లో స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన వస్తువులు

స్పందన బాగుంది



మెప్మా అర్బన్ మార్కెట్లకు మంచి స్పందన కనిపిస్తోంది. ఇళ్ల వద్ద తయారు చేసుకున్న ఉత్పత్తులను మార్కెట్‌లో పెట్టి విక్రయిస్తున్నాం. మంచి ధరతో పాటు ప్రజల నుంచి స్పందన కూడా బాగుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఎంతో ప్రోత్సాహకంగా ఉంటుంది. కష్టించి తయారు చేసుకున్న వస్తువులకు మంచి మార్కెటింగ్ కూడా లభిస్తుంది.

– దూడ మహేశ్వరి, చంద్రోదయ మహిళా సంఘం

సభ్యులను ప్రోత్సహించడమే లక్ష్యం



స్వయం సహాయక సంఘాల సభ్యుల జీవనోపాధులను మెరుగుపరుడమే ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగా మెప్మా అర్బన్ మార్కెట్లను పెడుతున్నాం. ఇళ్ల వద్ద తయారు చేసే వస్తువులను ఇక్కడకు తీసుకువచ్చి ప్రదర్శన, విక్రయాలు చేయవచ్చు. వీరు తయారు చేసే ఉత్పత్తులకు మంచి ధరతో పాటు ప్రోత్సాహం కూడా లభిస్తోంది. వీటిని స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్ నాగనరసింహారావు, కమిషనర్, కాకినాడ

పేదలకు దుప్పట్ల పంపిణీ



కరప హైస్కూలులో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న దాతలు

కరప: రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ వితరణతో 10 మంది పేదలకు దుప్పట్లు సమకూరాయి. కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు విజ్ఞప్తి మేరకు దాత రత్నప్రసాద్ దుప్పట్లను సమకూర్చగా ఆదివారం స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో విశ్వనాథంతో కలసి తాతీలు వాటిని అందజేశారు.

16, 17 తేదీల్లో టీ-20 క్రికెట్ లీగ్

బాలాజీచెరువు: కాకినాడ ఆర్ఎంసీ క్రీడా మైదానంలో ఈ నెల 16, 17 తేదీల్లో యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీ-20 క్రికెట్ మ్యాచ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి సురేష్ ఎంఎస్ఎన్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో 6వ తరగతి నుండి 9వ తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు నిర్వహిస్తున్నామని, ఈ నెల 13వ తేదీలోగా విద్యార్థులు తమ పాఠశాల హెచ్ఎంల ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఒకొక్క పాఠశాల నుంచి రెండు జట్లు వరకూ పాల్గొనవచ్చని, రూ.2 వేల ఫీజు చెల్లించాలన్నారు. ఇతర వివరాలకు 94921 41929 నెంబరుకు సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో గీతం పాఠశాల డైరెక్టర్ సుజ్ఞాన్, స్టేట్ లీగల్ అడ్వయిజర్ మతుకుమిల్లి విజయ్ పాల్గొన్నారు.

జగన్ నాయకత్వానికి విశేష ఆదరణ

- టీడీపీ, జనసేన పొత్తుతో కేడర్ నిర్వీర్యం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- టీడీపీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: టీడీపీ, జనసేన పొత్తును జీర్ణించుకోలేక ఇరు పార్టీల నుంచి ఎంతో మంది ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. వారంతా వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. స్థానిక జగన్నాథపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్‌బషీరుద్దీన్, మాజీ కార్పొరేటర్ బొర్రా రమణ ఆధ్వర్యంలో 21వ డివిజన్‌కు చెందిన రెడ్డి నాగరాజు, గుత్తుల దుర్గారావుతో పాటు సుమారు వంద మంది కార్యకర్తలు, యువకులు ముందుకు రాగా, వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కొత్తగా పార్టీలో చేరిన వారంతా సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలనే ఏకైక లక్ష్యంతో పార్టీ కోసం మరింత కష్టించి పని చేయాలని సూచించారు. జగన్నాథపురం ప్రాంతానికి చెందిన ఎంతో మంది టీడీపీ, జనసేన నుంచి త్వరలోనే వైఎస్సార్ సీపీలో చేరనున్నారని చెప్పారు. వీరందరి చేరికలతో జగన్నాథపురం ప్రాంతంలో పార్టీ మరింత బలోపేతం కాబోతుందని ద్వారంపూడి అన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ సుంకర విద్యాసాగర్, మాజీ కార్పొరేటర్లు సంగాని నందం, మీసాల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మినగర్‌లో..

కాకినాడ మహాలక్ష్మినగర్ 20వ డివిజన్‌కు ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకులు పలువురు ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి ఆధ్వర్యంలో వీరందరినీ ఎమ్మెల్యే ద్వారంపూడి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ కార్పొరేటర్లు కొప్పనాతి సత్యనారాయణ, వెలమల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి వసూలు చేసిన డబ్బు ఇప్పించండి

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన సామర్లకోట వాసులు
- కుల పెద్దల నుంచి రక్షణ కల్పించాలని వినతి

కాకినాడ సిటీ: ఎరుకుల కుల పెద్దలమంటూ తమ వద్ద నుంచి అక్రమంగా వసూలు చేసిన సొమ్ములను తిరిగి ఇప్పించి, తనపై తప్పుడు కేసులు బనాయించేందుకు ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకొని తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరుతూ జిల్లాలోని సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామానికి చెందిన సింగం శ్రీనివాస్, వెంకటలక్ష్మి దంపతులు ఎస్పీ సతీష్ కుమార్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు కాకినాడలో విలేకర్లతో మాట్లాడారు. ఆదివాసి ఎరుకుల సామాజిక వర్గానికి చెందిన తాను సామర్లకోట మండలం గొంచాల గ్రామంలో కొన్నేళ్లుగా చికెన్ దుకాణం పెట్టుకొని జీవిస్తున్నానన్నారు. అయితే తమ సామాజిక వర్గానికి చెందిన అమలదాసు సతీష్ తమ వద్ద హోల్‌సేల్‌గా చికెన్ కొనుగోలు చేసి వేరే దుకాణం పెట్టుకుని జీవిస్తున్నాడన్నారు. సతీష్‌కు తన భార్యతో కలహాల నేపథ్యంలో ఇటీవల ఉరి వేసుకొని చనిపోయిందన్నారు. దీనికి సంబంధించి ఏపీ ఎరుకుల సంక్షేమ సంఘం నాయకులుగా చలామణి అవుతున్న మానుపూడి రామకృష్ణ, జి.అన్నవరం, కె.పట్టాభి తమను తగవుకు రమ్మని పిలిచి తనను బెదిరించి రూ.4 లక్షలు తీసుకున్నారన్నారు. తాను ఏ తప్పు చేయకపోయినా బెదిరించి డబ్బులు తీసుకున్న నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు రావల్సిన డబ్బులను ఇప్పించి, తప్పుడు కేసు నుంచి తమను రక్షించి న్యాయం చేయాలని ఎస్పీని కోరినట్లు సింగం శ్రీనివాస్ దంపతులు వివరించారు.

భక్తిశ్రద్ధలతో మహా కుంభాభిషేకం



కుంభాభిషేకానికి గోదావరి జలాలను తీసుకువస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక అయోధ్యరామపురంలో కొలువైన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం జరిగింది. 108 మంది మహిళలు గోదావరి జలాలను బిందెలతో తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు అభిషేకించారు. పుట్టా సూరిబాబు ఆధ్వర్యంలో ఆలయం నుంచి భారీ ఊరేగింపుగా గోదావరి కాలువ వద్దకు మహిళలు వెళ్లి నీటిని తీసుకువచ్చి జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో కార్తిక మాస పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

అంధులకు ఆశాజ్యోతి ఐబ్యాంకు



ఐబ్యాంకు ద్వారా కంటిచూపు పొందిన వారిని పరిచయం చేస్తున్న నిర్వాహకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అంధులకు ఆశాజ్యోతిగా బాదం బాలకృష్ణ ఐబ్యాంక్ నిలుస్తుందని కాకినాడ సీపోర్టు చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ మెర్ల మురళీధర్ పేర్కొన్నారు. కాకినాడ ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని బాదం బాలకృష్ణ ఐబ్యాంక్‌లో ఆదివారం 17వ వార్షికోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న నాలుగు ప్రధాన ఐబ్యాంక్‌లలో కాకినాడ ఐబ్యాంక్ ఉండటం సంతోషమన్నారు. నేటి కాలంలో స్వచ్ఛంద సంస్థలు, ట్రస్టీల సేవా కార్యక్రమాలు మరింత విస్తృతమౌతున్నాయని, సమాజ సేవలో వీటిపాత్ర మరింత ఎక్కువ కావడం సంతోషంగా ఉందన్నారు. లయన్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ మాట్లాడుతూ అంధత్వ నివారణకు కృషిచేస్తూ 17వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న ఐబ్యాంక్ ఫౌండేషన్‌కు అభినందనలు తెలిపారు.అనంతరం ఐబ్యాంక్ ద్వారా కంటిచూపు పొంది మొట్టమొదటి సారిగా తమ కుటుంబసభ్యులను చూ సిన వారు తమ మధుర క్షణాల అనుభూతిని వేదికపై తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో ఐబ్యాంక్ ఫౌండర్ డాక్టర్ బాదం బాలకృష్ణ, చైర్మన్ దాకమర్రి శంకరరావు, కోశాధికారి దాసరి సాయికృష్ణ, ఐబ్యాంక్ మెడికల్ డైరెక్టర్ రావుల హారిక, సీమకుర్తి పాపారావు, పి.కనకరాజు, డాక్టర్ ఉద్దరాజు రమణరాజు పాల్గొన్నారు.

విధులకు విరామం.. వన విహారం..



వన సమారాధనలో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

- ఘనంగా జిల్లా బీసీ ఉద్యోగుల కార్తిక సమారాధన
- కుటుంబ సభ్యులతో హాజరైన ఉద్యోగులు
- పాల్గొన్న కమిషనర్, వివిధ సంఘాల నేతలు

కాకినాడ రూరల్: ఉద్యోగ విధులతో నిత్యం బిజీగా ఉండే జిల్లా ప్రభుత్వ బీసీ ఉద్యోగులు కార్తిక సమారాధన సరదాగా సాగింది. అన్ని మరచి పిల్లాపాపలు, కుటుంబ సభ్యులతో వారంతా ఒక చోట కలిసి ఐక్యతను చాటి ఆప్యాయతలు పంచుకున్నారు. తిమ్మాపురం గ్రామ పరిధిలో అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఎదురుగా మామిడితోటలో ఆదివారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామానుజం శ్రీనివాస్ అధ్యక్షతన వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ ఉద్యోగ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ నాగ నరసింహమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ హోదాలలో పనిచేస్తున్న బీసీ ఎంప్లాయిస్ ఒకరికి ఒకరికి అండగా ఉంటూ సహకారం అందించడంతో పాటు పిల్లల ఎదుగుదలకు తోడ్పాటు ఇవ్వాలని, సంఘ పరంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల అసోసియేట్ అధ్యక్షుడు అద్దంకి వెంకన్నబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి రామకృష్ణ, ఆర్థిక కార్యదర్శి వాసంశెట్టి కామేశ్వరరావు, ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రామరాఘవ, కాకినాడ జిల్లా టౌన్ బీసీ ఉద్యోగుల అధ్యక్షుడు చోడే శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సంగాడి రాజసింహవర్మ, దొమ్మేటి సుధాకర్‌బాబు, మల్లాడి రామగోపాల్, ఎం.శ్రీనివాసరావు, రాపర్తి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే శెట్టిబలిజల అభివృద్ధి

అమలాపురం రూరల్: ఐక్యతతోనే శెట్టిబలిజలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తెలిపారు. అమలాపురం పట్టణ శివారు కొంకాపల్లిలోని సత్తెమ్మ తల్లి గుడి ప్రాంగణంలో ఆదివారం ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజల కార్తిక వన సమారాధన జరిగింది. దీనికి బోస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ చైర్మన్ వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమారాధనకు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వేలాదిగా సంఘీయులు తరలివచ్చారు. తొలుత గోఖలే సెంటర్‌లోని శెట్టిబలిజల పితామహుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వాసంశెట్టి సత్యం రూ.కోటి విరాళాన్ని ప్రకటించి శెట్టిబలిజల అభ్యున్నతికి వెచ్చించాలని ఆకాంక్షించారు.

తీరంలో కార్తిక శోభ



సముద్రంలో జలకాలాడుతున్న సందర్శకులు



ఉప్పువారి సత్రం వద్ద వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

ఉప్పాడకు సందర్శకుల తాకిడి

కొత్తపల్లి: సముద్ర తీరంలో వసంధైన వన భోజనాలతో, పర్యాటకులు సేదతీరడంతో ఆదివారం ఉప్పాడ సాగర తీరం కిటకిటలాడింది. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో కొత్తపల్లి మండల గ్రామాలతో పాటు పిఠాపురం, సామర్లకోట, కిర్లంపూడి, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో సందర్శకులు ఉదయం నుంచి ఉప్పాడ సాగర తీరానికి చేరుకోవడంతో తీరానికి తాకిడి పెరిగింది. పర్యాటకులు వన భోజనాలు చేసి కడలి కెరటాల్లో కేరింతలు కొట్టారు. చిన్నాపెద్దా తేడా లేకుండా సముద్ర స్నానాలు చేశారు. ఇసుక తిన్నెల్లో ఆటలాడుతూ ఉల్లాసంగా గడిపారు. సముద్ర కెరటాల మధ్య యువకులు చేసిన పిరమిడ్ విన్యాసాలు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. తుని సమీపంలో తలుపులమ్మతల్లి లోవ అమ్మవారిని దర్శించుకోవడానికి వెళ్లిన భక్తులు మధ్యాహ్నానికి తిరిగి సాగర తీరానికి చేరుకున్నారు. తీరంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో పర్యాటకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తీరంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కొత్తపల్లి ఎస్ఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది గస్తీ నిర్వహించారు.

జోరుగా కార్తిక వన సమారాధనలు

సామర్లకోట: కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో కార్తిక వన సమారాధనలు విరివిగా జరిగాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వాకర్స్ అసోసియేషన్ పిఠాపురం రోడ్డులోని ఉప్పువారి సత్రంలోని రాచ ఉసిరి చెట్టు వద్ద కార్తిక వన సమారాధన నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ సైపుల్లా ఖురేషీ, ఉపాధ్యక్షుడు యూఆర్ కెనడీ, కార్యదర్శి విప్పర్తి కొండలరావు, సహాయ కార్యదర్శి నక్కా శ్రీను, కోశాధికారి గుండు శంకరరావుల ఆధ్వర్యంలో జరిగింది. అలాగే సత్యనారాయణపురంలోని సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద, ఈటీసీలోను, మాండవ్య నారాయణస్వామి ఆలయంలోను, వ్యవసాయక్షేత్రంలోను జోరుగా కార్తిక వన సమారాధనలు జరిగాయి.

సంక్షేమ పథకాలే విజయ సోపానాలు

- హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి
- తిరుపతి ఆలయానికి పాదయాత్ర



తిరుపతికి పాదయాత్రగా వెళ్తున్న దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ సీఎంగా గెలిపిస్తాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. వైఎస్సార్ సీపీ విజయాన్ని కాంక్షిస్తూ ఏడు పర్యాయాల పాటు నిర్వహించే పాదయాత్రలో భాగంగా ఐదవ రోజు ఆదివారం సామర్లకోట నుంచి మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి పార్టీ నాయకులతో కలసి ఆయన వెళ్లారు. జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీర్రాఘవరావు, గృహ సారథుల మండల కన్వీనర్ గోపు మురళి, కౌన్సిలర్ దూది రాజు, నల్లల గోవిందు, సుందరెడ్డి రాజు, పార్టీ కార్యకర్తలు, అభిమానులతో వెళ్లిన ఆయనకు ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సీఎం జగన్ మరో 20 ఏళ్లపాటు సీఎంగా కొనసాగాలని ప్రత్యేక పూజలు చేశారు. వర్గాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తూ ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయి, ఉప సర్పంచ్‌లు గోలి రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.